# 3న సిద్దిపేటకు రైలు

- మంత్రి హరీశ్‌రావు
- గురుపూజోత్సవం.. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి

సిద్దిపేట, సెప్టెంబర్ 30 : సిద్దిపేటకు 3న మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాద్ నుంచి రైలు ప్రారంభం కాబోతున్నదని మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. శనివారం సిద్దిపేట కొండ మల్లయ్య గార్డెన్‌లో జరిగిన ట్రెస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం.. ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే వారు తమ కుటుంబాలకు ఎంతోకొంత ఉపయోగ పడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఉపాధ్యయులుగా మీరు సమాజానికి చక్కని సేవలను అందిస్తున్నారు. నేడు విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో గురుతర బాధ్యతను పోషిస్తున్నారని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభం కావడం, ప్రభుత్వం పెద్ద ఎత్తున రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయడంతో ప్రైవేట్ పాఠశాల నడపడం యాజమాన్యలకు కత్తి మీద సాముల మారిందన్నారు. పోటి పెరిగిందన్నారు. సిద్దిపేట జిల్లా ఏర్పాటు, రైలు తీసుకురావడం, సిద్దిపేటకు గోదావరి జలాలు అనేవి ఎన్నికల ప్రచారంగా ఉండేవన్నారు. కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్, సిద్దిపేట ప్రజల ఆశీస్సులతో హామీలు అన్ని నేరవేరాయన్నారు. మహిళా డిగ్రీ కాలేజీతో పాటు ప్రభుత్వ ఐటీఐ,4 పాలిటెక్నిక్ కాలేజీలు, మెడికల్ కాలేజీ, బీఎస్సీ ఆగ్రికల్చర్, వెటర్నరీ కోర్సులను ఏర్పాటు చేసుకున్నామన్నారు. బీవీఎస్సీ కాలేజీ నర్సింగ్ కాలేజీ, బీఫార్మసీ కాలేజీని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. సిద్దిపేటకు లా కాలేజీని తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా ఏర్పడి 5 ఏండ్లయ్యిందన్నారు. ఒకప్పుడు కరువు నేలగా ఉన్న సిద్దిపేట కాళేశ్వరం ప్రాజెక్టు రంగనాయక సాగర్ వల్ల నేడు సంవత్సరానికి 2 పంటలు పండుతున్నాయన్నారు.400 ఫీట్లు బోర్లు వేసిన చుక్క నీరు రాని సిద్దిపేటలో నేడు బోర్లు, బావులు ఎండి పోవడం లేదన్నారు. లక్ష ఎకరాల మాగాణిగా మారిందన్నారు. రైలు రావాలని చాలా ఎండ్లకల ఉండేదని, అది 3న మధ్యాహ్నం మూడు గంటలకు సిద్దిపేట -హైదరాబాద్‌కు రైలు ప్రారంభం కాబోతుందని మంత్రి తెలిపారు. రైలు వచ్చిన తర్వాత హైదారాబాద్‌కు వెళ్లి ఉద్యోగం చేసుకొని రావచ్చన్నారు. తొలి దశలో సిద్దిపేట హైదరాబాద్‌కు నడుపుతామన్నారు. రెండో దశలో సిద్దిపేట-తిరుపతి,సిద్దిపేట-బెంగళూరుకు రైలు నడపనున్నట్లు మంత్రి తెలిపారు. రైలు రావడం అనేది గొప్ప అనుభూతిని ఇస్తుందన్నారు. సిద్దిపేటకు జాతీయ రహదారులు, రైల్వే లైను వేశామన్నారు. ఆలయాలకు, విద్యాలయాలకు సిద్దిపేటను కేంద్రంగా మార్చామన్నారు. అన్నింట సిద్దిపేటను అభివృద్ధి చేస్తున్నమన్నారు. రేపటి తరాలకు కోసం ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేటకు ఐటీ టవర్ తెచ్చి వెయ్యి మంది పిల్లలకు ఉద్యోగ ఆవకాశాలను కల్పించామన్నారు. ఉపాధ్యాయులకు కరో నా సమయంలో అండగా నిలిచామన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు ట్రెస్మా ఆధ్వర్యంలో రూ.5లక్షల బీమా చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచ్చ వేణుగోపాల్, రాధాకృష్ణ శర్మ, జెగ్గ మల్లారెడ్డి, ట్రెస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, భగవాన్‌రెడ్డి, కృష్ణమాచార్యులు, రాజేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

# కుల సంఘాల భవనాలకు నిధులు మంజూరు

- నియోజకవర్గంలో సామాజిక భవనాలకు మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి హరీశ్ రావు


మంత్రి హరీశ్ రావుకు బొకెను అందజేస్తున్న నేతలు

సిద్దిపేట, సెప్టెంబర్ 30 : సబ్బండ వర్గాల సమ్మిళిత అభివృద్ధి.. బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం.. సిద్దిపేటలో అన్ని కులాల, వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేటలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయా కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి ఆయన మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గం లోని చిన్నకోడూర్ మండలంలోని పలు గ్రామాల్లో కుల సంఘాల భవనాలకు రూ.68 లక్షలు మంజూరు అయినట్లు మంత్రి చెప్పారు. రాముని పట్ల లోని గౌడ సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, సికిందలాపూర్ గ్రామంలోని హనుమాన్ టెంపుల్ షెడ్ నిర్మాణానికి రూ.3 లక్షలు, పెద్దకోడూర్ గ్రామంలో రజక సంఘం భవన నిర్మాణాకి రూ.10 లక్షలు, రామంచ గ్రామంలో గౌడ సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, ఒడ్డెర సంఘ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, అనంత సాగర్ గ్రామంలోని రెడ్డి సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, ఇబ్రహీంనగర్ యాదవ సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, గోనెపల్లి గ్రామంలో గౌడ సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు అయినట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు మంజూరు పత్రాలని పలు కుల సంఘాల ప్రతినిధులకు అందజేశారు.

### స్థలాల మంజూరు పత్రాలని పంపిణీ చేసిన మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట పట్టణంలో రజక సంఘం ఫంక్షన్‌హాల్‌కు 12 గుంటల స్థలం, ముస్లిం శ్మశాన వాటిక నిర్మాణానికి 4 ఎకరాలు, వాలీబాల్ అకాడమీ నిర్మాణానికి 1.20 ఎకరం, హిందూ శ్మశాన వాటిక నిర్మాణానికి 1.20 ఎకరం, ఎల్లుపల్లి గ్రామంలో గౌడ సంఘం ఈత చెట్లు నాటేందుకు ఎకరం స్థలాన్ని మం జూరు చేసినట్లు మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా పలు సంఘాల ప్రతినిధులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావుకు వారు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు.


నాయకులకు నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

# చిన్నారికి మంత్రి ఆశీర్వాదం


సిద్దిపేట శిశుగృహాలయంలో శ్రీజ అనినామకరణం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 30 : సిద్దిపేట అర్బన్ మం డలం బూర్గుపల్లి శివారులో ఓ నిరుపేద తల్లి మూడునెలల చిన్నారి(శ్రీజ)ను విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న జిల్లా బాలల సంరక్షణ అధికారులు తల్లి నుంచి చిన్నారిని కాపాడి శిశువిహార్‌లో చేర్చి ఆలనాపాలనా చూస్తున్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో రూ. 30 లక్షలతో నిర్మించిన శిశుగృహాన్ని మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. శిశుగృహంలో అనాథ శిశువులను మంత్రి పరిశీలిస్తుండగా, ఆయాల చేతిలో అల్లారుముద్దుగా ఉన్న శ్రీజను ఎత్తుకొని కాసేపు ఆడించారు. చిరునవ్వులతో ముద్దులొలుకుతున్న చిన్నారికి శ్రీజ అనే నామకరణం చేశారు. తల్లిదండ్రులు లేని లోటు కనిపించకుండా ఆనందంగా పెరిగేలా శిశుగృహ అధికారులు చూడాలని సూచించారు. మంత్రి వెంట జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట నాకుటుంబం..
# సేవ చేయడం నా బాధ్యత

- మహిళలకు లోన్ కోసం ఇప్పుడు బాధ లేదు..
- ముండ్రాయిలో డీసీసీబీ బ్యాంక్ ప్రారంభించిన ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు


ముండ్రాయిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

నంగునూరు, సెప్టెంబర్ 30 : సిద్దిపేట నా కుటుంబం.. మీకు సేవ చేయడమే నా బాధ్యతని.. ఎవరికీ ఏ బాధ వచ్చినా తాను సేవ చేసేందుకు కష్టపడుతానని మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని ముండ్రాయి గ్రామంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌ను జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముండ్రాయిలో బ్యాంక్ ఏర్పాటుతో మంచి సౌకర్యం అందుతుందన్నారు. గతంలో రోడ్డు లేక అనేక ఇబ్బందులు పడ్డారని.. కానీ నేడు ముండ్రాయికి నాలుగు వరుసల రోడ్డు రాబోతున్నదన్నారు. మహిళా సంఘాల లోన్ కోసం గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి ఉండేదని.. నేడు ఆ తిప్పలు లేకుండా డీసీసీబీ బ్యాంక్ ఉపయోగపడుతుందన్నారు. నాడు మండలానికి ఒక బ్యాంక్ మాత్రమే ఉండేదని.. ఇప్పుడు అన్ని గ్రామాల్లో బ్యాంక్‌లు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఎరువుల బస్తా కోసం ఎన్నో కష్టాలు పడ్డామని చెప్పులు లైన్‌లో పెట్టామని.. కానీ సీఎం కేసీఆర్ వచ్చాక ఎరువుల కష్టాలు ఉన్నాయా అని అడిగారు. సీఎం కేసీఆర్ రైతు విలువ పెంచడం వల్లనే భూమి విలువ పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెంద్రం కమలాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సుమలత చందు, పీఏసీఎస్ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, రమేశ్ గౌడ్ పాల్గొన్నారు.

# బీసీ వెల్ఫేర్ స్కూల్ ప్రారంభం


చింతమడకలో బీసీ వెల్ఫేర్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

సిద్దిపేటరూరల్, సెప్టెంబర్ 30 : సిద్దిపేట రూరల్ మండలంలోని చింతమడక గ్రామ పరిధిలో నిర్మించిన అధునాతన బీసీ వెల్ఫేర్ స్కూల్, అర్బన్ పార్క్‌ను శనివారం వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దేశానికి ఆదర్శంగా నిలిచేలా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో విద్యారంగంలో అనేక మార్పులు జరిగాయన్నారు. నాణ్యమైన విద్యతోపాటు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ శ్రీహరి గౌడ్, సర్పంచ్ హంసకేతన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదయ్య, మండల పరిషత్ వైస్ చైర్మన్ యాదగిరి, పలు గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్ఎస్ స్థానిక నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

### రావురూకులలో పెరిక భవనం ప్రారంభం

రావురూకులలో కొత్తగా నిర్మించిన పెరిక సంఘం భవనాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అంతకుముందు వేంకటేశ్వర ఆలయ పునర్మిణానికి శంకుస్థాపన చేశారు. ఆత్మగౌరవ భవనాలకు నిధులు మంజూరు చేస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి కవితారవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, పెరిక సంఘం పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.